క్లుప్తంగా

పారిశుధ్యంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎంఏ రాజు

వేంసూరు: సీజనల్ వ్యాధుల కాలంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ ఎంఏ రాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చౌడవరం తండా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో డ్రెయినేజీ పూడికతీత పనులతో పాటు ఎక్కడ మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

దుకాణాదారులు పరిశుభ్రత పాటించాలి

కల్లూరురూరల్: కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీతో సహా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలల్లోని దుకాణాదారులు పరిశుభ్రత పాటించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ కోరారు. దుకాణదారులు చెత్తను గ్రామ పంచాయతీలలో చెత్త సేకరించే సిబ్బందికి అందించాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యంగా రోడ్డుపై ప్రజలు తిరిగే ప్రాంతంలో పడేసినట్లయితే పంచాయతీరాజ్ యాక్ట్ 2018 ప్రకారం చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నీటి నిల్వలు లేకుండా చూడాలి

పెనుబల్లి: నివాస గృహాల వద్ద ఖాళీగా, నిరుపయోగంగా ఉన్న తొట్లు, డ్రమ్ములు, కొబ్బరి బొండాల్లో నిరు నిల్వ లేకుండా చూడాలని లంకాసాగర్ పీహెచ్‌సీ వైద్యుడు కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని సూరయ్యబంజర్ తండాలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో మురికి నీటి నిల్వలను తొలగించి అవసరమైన చోట ఆయిల్ బాల్స్ వేయించి, బ్లీచింగ్ చల్లించారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి అవసరమైన వారికి చికిత్సలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కళావతి, హెచ్‌ఈఓ శ్రీనివాస్, హెచ్‌ఎస్ ప్రకాశ్‌రావు, నాగేశ్వరరావు, నిర్మల కుమారి, ఏఎన్‌ఎం కుమారి, నాగమణి, ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి కల్పించాలి

కారేపల్లి: గిరిజన సంక్షేమ శాఖలో పండిట్స్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తూ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డీఎస్ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని రేలకాయలపల్లి ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది పండిట్స్, పీఈటీ పోస్టులు అప్‌గ్రేడ్ చేయక పోవటంతో గిరిజన ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. సమావేశంలో యూటీఎఫ్ నాయకులు నాగక్ష్మి, సూర్య, నాగేశ్వరరావు, గంగాధర్, రామారావు, పద్మ, దేవ్‌సింగ్, రాంబాబు, సక్రాం, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్

కల్లూరురూరల్: ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు గృహజ్యోతి, గ్యాస్ సబ్సిడీ పథకాలు మంజూరు కాలేదు. అర్హత ఉండి కూడా ఈ పథకాలు మంజూరు కాకపోవటంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన ప్రభుత్వం ప్రజాపాలన దరఖాస్తుల సవరణకోసం సిబ్బందిని నియమించింది. గతంలో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను మరొకసారి ఆన్‌లైన్ పరిశీలించి సిబ్బంది సరి చేస్తున్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అర్హులైన వారికి ప్రభుత్వ సబ్సిడీ పథకాలు అందేలా మండల పరిషత్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

భూవివాదంపై ఫిర్యాదు



తహసీల్దార్ సాంబశివుడుకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

కల్లూరురూరల్: మండలంలోని లక్ష్మీపురంలోని పంగిడి ప్రాజెక్టు పరిధిలో సర్వే నంబర్52 ప్రకారం 176 ఎకరాల సీలింగ్ భూమి ఉంది. అందులో 29.30 ఎకరాల సీలింగ్ ల్యాండ్ ఖాళీగా ఉండగా గతంలో ప్రభుత్వం ఓ రైతుకు 5ఎకరాల భూమి అసైన్మెంట్‌గా ఇచ్చింది. మిగిలిన భూమిని ఓ రైతు అక్రమంగా ఆక్రమించుకొని సాగుకు సిద్ధం కాగా.. మరో వర్గానికి చెందిన రైతులు తమకు భూమి హక్కు పత్రాలు ఉన్నాయని చెబుతూ అడ్డగించారు. దీంతో ఇరు వర్గాల రైతుల మధ్య వివాదం నెలకొంది. ఈ సంఘటనపై వారు తహసీల్దార్ పులి.సాంబశివుడుకు తమ వాదనలు వినిపించారు. కాగా.. తహసీల్దార్ ఇరువర్గాల రైతులు తమ భూమి ఆధారపత్రాలు ఇవ్వాలని, రెవెన్యూ పరంగా విచారణ జరిగేవరకు ఎవరు సాగు చేయొద్దని హెచ్చరించారు.

మొండి బకాయిలపై.. విద్యుత్‌శాఖ దృష్టి

- బిల్లుల వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్
- డివిజన్‌లో రూ.27.95 కోట్ల బకాయిలు

మండలం	విద్యుత్ కనెక్షన్లు	బకాయిలు
సత్తుపల్లి	40,112	రూ.7.34 కోట్లు
వేంసూరు	22,884	రూ.2.85 కోట్లు
పెనుబల్లి	24,272	రూ.7.29 కోట్లు
తల్లాడ	23,780	రూ.1.92 కోట్లు
కల్లూరు	28,189	రూ.7.06 కోట్లు
ఏన్కూరు	15,603	రూ.1.48 కోట్లు

సత్తుపల్లిటౌన్: విద్యుత్ వాడుకున్నా.. ఎటువంటి రాయితీ లేకపోయినా చాలా మంది బిల్లులు చెల్లించడం లేదు. దీంతో విద్యుత్‌శాఖకు బకాయిలు గుదిబండగా మారాయి. సత్తుపల్లి డివిజన్‌లో 1,54,840 విద్యుత్ కనెక్షన్లు ఉండగా.. రూ.27.95 కోట్లు విద్యుత్ బకాయిలు ఉన్నాయి. కోట్లాది రూపాయలు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో ఆ శాఖ ఖజానాకు గండిపడుతోంది. ఇల్లు, భవనాలు, పరిశ్రమలు, ఇతర కేటగిరీల నుంచి బిల్లులు రావాల్సి ఉన్నాయి. గతంలో 90శాతం మేర బిల్లులు వసూలు అయ్యే పరిస్థితి ఉంటే.. ప్రస్తుతం 50శాతం వరకు కూడా బిల్లులు రాని పరిస్థితి కొన్ని సెక్షన్లలో నెలకొందని విద్యుత్‌శాఖ అధికారులు వాపోతున్నారు. బిల్లులు వసూలు చేసేందుకు ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి సిబ్బందిపై ఒత్తిడి రావడంతో విద్యుత్ సిబ్బంది బిల్లులు వసూళ్లపై దృష్టి సారించాయి.

గృహజ్యోతి పేరుతో చెల్లింపునకు వెనుకంజ..

విద్యుత్‌శాఖకు మొండి బకాయిలు మార్చి నెల నుంచి చెల్లించడం లేదని తెలుస్తోంది. ప్రభుత్వం గృహజ్యోతి పథకం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుండటంతో లబ్ధిదారులతో పాటు ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న వారు సైతం బిల్లులు చెల్లించడంలో వెనుకంజ చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించినప్పటి నుంచి బిల్లు మాఫీ అవుతుందిలే అనే అపోహతో కొందరు ఉండడంతో అవి విద్యుత్ శాఖకు బకాయిలు తడిసి మోపెడౌతున్నాయి. మార్చి నెల నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు వెనుకంజ వేస్తున్నారు. విద్యుత్‌శాఖకు బకాయిలు భారంగా పరిణమించింది. గృహజ్యోతి అమలు కోసం ప్రజా పాలన దరఖాస్తుల్లో చాలా మంది వినియోగదారులు యూఎస్సీ నంబర్ తప్పుగా రాశారు. దాన్ని అప్లికేషన్‌లో ఎడిట్ చేసే ఆప్షన్ లేకపోవడంతో దరఖాస్తు చేసుకున్న వారికి గృహజ్యోతి అమలు కావడం లేదని తెలుస్తోంది.

స్పెషల్ డ్రైవ్..

విద్యుత్ బకాయి దారులు జాబితాను తయారు చేసి పెద్ద మొత్తంలో చెల్లించేవారు ఎవరున్నారు. ముందుగా అధికారులు గుర్తిస్తున్నారు. ప్రతి సర్వీస్‌కు వెళ్లి పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతున్నప్పటికీ వినియోగదారులు ముందుకు రాని పరిస్థితి నెలకొంది. దీంతో విద్యుత్ అధికారులు బిల్లులు వసూళ్ల కోసం తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. విద్యుత్ బిల్లు బకాయి ఎంతుందో తెలియజేస్తూ వినియోదారులు వెంటనే చెల్లించేలా విద్యుత్ సిబ్బంది అవగాహన కలిగిస్తున్నారు. అదే విధంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. నెలాఖరు కావటంతో పగలంతా విదు యత్ వసూళ్లపైనే ప్రధానంగా దృష్టి పెట్టి సాయంత్రానికల్లా సమీక్షలతో మునిగి తేలుతుండటంతో విద్యుత్ అధికారులు, సిబ్బంది బిల్లులు వసూళ్ల విషయంలో సతమతమవుతున్నారు. ఈ స్పెషల్ డ్రైవ్‌తోనైనా వినియోగదారుల్లో కదలిక వచ్చి బిల్లులు చెల్లించాలని విద్యుత్ అధికారులు అభిప్రాయపడుతున్నారు.



మీటర్ వారీగా తనిఖీ చేస్తున్న విద్యుత్ సిబ్బంది

బిల్లులు చెల్లించి సహకరించండి..



విద్యుత్ బిల్లులు నెల నెలా చెల్లించి వినియోగదారులు విద్యుత్‌శాఖకు సహకరించాలి. గృహజ్యోతి అమలు కాని వినియోగదారులు తప్పని సరిగా బకాయిలు చెల్లించాలి. బిల్లులు చెల్లించని వారికి ఇంటింటికి వెళ్లి సత్వరమే చెల్లించేలా విద్యుత్ సిబ్బంది అవగాహన కల్పించేందుకు స్పెషల్‌డ్రైవ్ చేపట్టాం.

– ఎల్.రాములు, డీఈఈ, విద్యుత్‌శాఖ, సత్తుపల్లి

రైలు కదిలితే ప్రమాదమే..



ఆగి ఉన్న గూడ్స్ రైలు కింద నుంచి దాటుతున్న పిల్లలు

చింతకాని: మండలంలో రైల్వే మూడో లైను పనులు జరుగుతుండటంతో రామకృష్ణాపురం రైల్వే గేటు వద్ద పలు గూడ్స్ రైళ్లను గంటల తరబడి నిలిపివేస్తున్నారు. ఈ దారిలో రామకృష్ణాపురం నుంచి ప్రతిరోజు స్కూళ్లకు వెళ్లే పిల్లలు తిరిగి ఇంటికి వచ్చే సమయంలో గేటులో గూడ్స్ రైళ్లు నిలిచి ఉండటంతో గంటల తరబడి వేచి ఉండలేక పిల్లలు ఆగి ఉన్న గూడ్స్ రైలు కింద నుంచి దాటి వెళ్తున్నారు. ఆ సమయంలో రైలు కదిలితే ప్రమాదమే జరుగుతుంది. ప్రమాదమని తెలిసినా రైళ్లు ఎప్పుడు వెళ్తాయో తెలియక.. వేచి ఉండలేక రైలు కింద నుంచి దాటి వెళ్తున్నారు. ఇదిలా ఉండగా గ్రామం నుంచి ఖమ్మం వెళ్లే వారు, ఖమ్మం నుంచి గ్రామానికి వెళ్లే వాహనదారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే అధికారులు గూడ్స్ రైళ్లను గేటులో నిలపకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, విద్యార్థులు కోరుతున్నారు.

బురదమట్టితో ఆగమాగం..

కొణిజర్ల: పెద్దపురం చెరువులోని నల్లరేగడి మట్టిని పలువురు పొలాలకు, ఇళ్ల స్థలాలకు తోలుకుంటున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్లలోని జారి కిందపడిన మట్టి వానకు కరిగి రోడ్డంతా బురదమయంగా తయారైంది. ద్విచక్రవాహనదారులు బురదలో జారి కింద పడిపోతున్నారని స్థానికులు తెలిపారు. ఆ మార్గంలో నడిచి వెళ్లేందుకు కూడా నానా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఐబీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఏమీ పట్టనట్లు వ్యవహరించారని తెలిపారు. దీంతో గ్రామస్తులు ట్రాక్టర్లు తిప్పొద్దని రోడ్డుపై ఆందోళన చేపట్టారు. అనంతరం రోడ్డును శుభ్రం చేసుకున్నారు.



పెద్దరాంపురంలో ట్రాక్టర్ నిలిపి ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

తుమ్మలను సన్మానించిన రైతులు



మంత్రి తుమ్మల నాగేశ్వరరావును శాలువా కప్పి సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు,రైతులు

వేంసూరు: సీతారామప్రాజెక్ట్ విజయవంతం కావడంతో వేంసూరు మండల రైతులు, కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం గండుగుల పల్లిలోని ఆయన నివాసం వద్ద కలిసి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాసరి చంద్రశేఖర్‌రెడ్డి, వెల్ది జగన్‌మోహన్‌రావు, తక్కెళ్లపాటి గోపాలకృష్ణ, ఎండీ ఫైజుద్దీన్, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

జక్కంపూడి కృష్ణమూర్తికి తుమ్మల పరామర్శ..

తల్లాడ: మండలంలోని బిల్లుపాడుకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు జక్కంపూడి కృష్ణమూర్తి ఇటీవల అనారోగ్యానికి గురికాగా.. మంత్రి తుమ్మల పరామర్శించారు.

తేనేటీ విందులో పాల్గొన్న మంత్రి..

తల్లాడలో రాయల రాము గృహంలో మంత్రి తుమ్మల తేనేటీ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు సీతారామ ప్రాజెక్ట్ ట్రయల్ రన్ సక్సెక్ కావటంతో మంత్రి తుమ్మలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వీరారెడ్డి, కృష్ణారెడ్డి, అప్పల్‌రాజు, రఘుపతిరెడ్డి, మల్లిఖార్జున్, నరసింహారావు, రాము, చందర్‌రావు, నాగన్న, గోపయ్య గౌడ్, బసవయ్య పాల్గొన్నారు.

సత్యనారాయణకు..

సత్తుపల్లి: స్వతంత్ర్య సమయోధుడు, వేంసూరు మండలం లచ్చన్నగూడెం గ్రామ మాజీ సర్పంచ్ రాయల సత్యనారాయణ అస్వస్థతకు గురికావటంతో శుక్రవారం సత్తుపల్లిలోని ఆయన స్వగృహంలో రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించి కుటుం సభ్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చల్లగుళ్ల నర్సింహారావు, జగన్మోహన్‌రావు ఉన్నారు.

పదవీ విరమణ సన్మానం



బీపీఎంకు సన్మానం చేస్తున్న ఉద్యోగులు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని సబ్ పోస్టాఫీస్ కార్యాలయంలో శుక్రవారం మీనవోలు బ్రాంచ్ పోస్టుమాస్టర్(బీపీఎం) చెరుకూరి కోటేశ్వరరావు పదవీ విరమణ సన్మానం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మధిర సబ్ డివిజన్ ఐపీఓ కోటేష్, ఎంఓ ఉదయ్‌సీవన్, ఎస్పీఎం మణికంఠ శాలువాలు, పూలదండలతో చెరుకూరి కోటేశ్వరరావును సత్కరించారు. ఆయన సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సూరానేని రామకోటేశ్వరరావు, సిబ్బంది బూసిపల్లి శశిభూషణ్‌రెడ్డి, కేతేపల్లి పిచ్చియ్య, వెంకటేశ్వరరావు, తదితరులున్నారు. మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ నాయకులు శీలం మాధవరెడ్డి, షేక్ జానీబాషాలు పూలమాలతో సత్కరించారు.

నివాళి..

ముదిగొండ: మండలపరిధిలోని పెద్దమండవకు చెందిన కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు కోడే నాగేశ్వరరావు మాతృమూర్తి(95) గురువారం రాత్రి మృతిచెందింది. ఆమె మృతదేహాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్రగిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పసుపులేటి దేవేంద్రం, ఇలవల పుల్లారెడ్డి, సింగు రాజయ్యలు నివాళులు అర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

బీమా నగదు అందజేత



బీమా నగదు అందజేస్తున్న మేనేజర్ దివ్య

ఎర్రుపాలెం: మండలంలోని రాజుపాలెం సొసైటీకి చెందిన మహిళా రైతు పొట్టేటి భారతమ్మ ఇటీవల మృతి చెందింది. ఆమె పేరిట సొసైటీలో గ్రూప్ ఇన్సూరెన్సు చేయగా.. రూ.50వేల మంజూరయ్యాయి. శుక్రవారం మండలకేంద్రంలోని డీసీసీబీ కార్యాలయంలో ఈ నగదును మృతురాలు భర్త పొట్టేటి లక్ష్మారెడ్డికి బ్రాంచ్ మేనేజర్ ఎస్ దివ్య, సొసైటీ చైర్మన్ వెన్నపూస కృష్ణారెడ్డిలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్‌సుధాకర్, సెక్రటరీ బొగ్గుల శివారెడ్డి, సిబ్బంది కుంపటి శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకుడు సుధాకర్‌రెడ్డి తదితరులున్నారు.

అంజనాపురంలో సైడ్‌డ్రెయిన్ పనులు ప్రారంభం

తల్లాడ: మండలంలోని అంజనాపురం గ్రామంలో సైడ్ డ్రెయిన్ పనులను శుక్రవారం ఎంపీటీసీ కొమ్మినేని ప్రభాకర్‌రావు ప్రారంభించారు. డీఎంఎఫ్‌టీ నిధులు రూ.10 లక్షలతో పనులు జరుగనున్నాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొమ్మినేని విద్యాసాగర్‌రావు, కొమ్మినేని చంద్రశేఖర్, కూలీలు పాల్గొన్నారు.

కారేపల్లి రైల్వేజంక్షన్‌లో సమస్యలు పరిష్కరించాలి

కారేపల్లి: కారేపల్లి రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరతూ.. కారేపల్లి రైల్వేజంక్షన్ అభివృద్ధి కమిటీ సభ్యుడు, బీజేపీ సీనియర్ నాయకుడు తురక నారాయణ సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే (డీఆర్‌ఎం) కార్యాలయంలో శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. రైల్వే స్టేషన్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, కరోనా సందర్భంగా రద్దు చేసిన రైళ్లను పునరుద్దరించాలని, టికెట్ బుకింగ్ కార్యాలయాన్ని పునప్రారంభించాలని, భద్రాచలం నుంచి తిరుపతి వరకు రెండు పుణ్యక్షేత్రాలను కలుపుతూ ఒక ప్రత్యేక రైలును నడపాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

సూచనలు ఇవ్వండి



మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావు

కారేపల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టనున్న రైతు భరోసా పథకం అమలుపై రైతులు సలహాలు, సూచనలు ఇవ్వాలని కారేపల్లి సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, కార్యదర్శి బొల్లు హన్మంతరావులు తెలిపారు. శుక్రవారం కారేపల్లి సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 29న ఉదయం 9గంటలకు సొసైటీ కార్యాలయంలో రైతులు, పాలక వర్గ సభ్యులతో నిర్వహించనున్న మహాజన సభకు జిల్లా వ్యవసాయాధికారి విజయలక్ష్మి హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షులు ధరావత్ మంగీలాల్, డైరెక్టర్లు అడ్డగోడ ఐలయ్య, బానోత్ హీరాలాల్, మర్సకట్ల రోశయ్య, దేగల ఉపేందర్, కొత్తూరు రామారావు, మద్యాహ్నపు శ్రీనివాస్, పాప తదితరలు పాల్గొన్నారు.

సమస్యలపై అధికారుల నిలదీత



మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న అధికారులు

బోనకల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కంకణాల సౌభాగ్యం అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. తహసీల్దార్ పున్న చందర్ పౌరసరఫరాల శాఖకు సంబంధించి మాట్లాడుతుండగా.. పెద్దబీరవల్లి ఎంపీటీసీ కర్లకుంట దేవమణి రేషన్ కార్డులు లేక అనేకమంది నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారని, కార్డులు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించగా.. ఆన్‌లైన్‌లో కొత్త కార్డులు, పేర్లు మార్పులు చేసుకోవచ్చన్నారు. ఎవరైన 3 నెలల పాటు రేషన్ తీసుకోకపోతే ఆ కార్డులు రద్దవుతాయని తెలిపారు. లక్ష్మీపురం సొసైటీ అధ్యక్షుడు మాదినేని వీరభద్రం మాట్లాడుతూ.. గోవిందాపురం (ఎల్) గ్రామంలో అసైన్డ్ భూములను ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పేదలపై కేసులు పెట్టడం సరికాదన్నారు. తహసీల్దార్ స్పందిస్తూ.. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన భాద్యత అధికారులపై ఉందన్నారు. మండల విద్యాశాఖ తరుపున మల్లిఖార్జున్ రావు మాట్లాడుతూ.. బడిబాటలో కొత్తగా 359 మందిని విద్యార్థులను చేర్పించడం జరిగిందన్నారు. ఇటీవల పదోన్నతుల ద్వారా ఉన్నత పాఠశాలలో ఖాళీ పోస్టులన్నీ భర్తీ అయ్యాయని కేవలం 6 పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయన్నారు. మద్యాహ్న భోజన బిల్లులు రావాల్సి ఉందన్నారు. పశు వైద్యాధికారి అన్వేష్ మాట్లాడుతుండగా.. గోవిందాపురం(ఎల్) పశు వైద్యశాలలో వైద్యం సక్రమంగా అందడం లేదని వైద్యులు ఎప్పుడు వస్తారో తెలియడం లేదని ప్రజాప్రతినిదులు ఫిర్యాదు చేయగా.. ఇటువంటి పరిస్థితి మరలా తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని వైద్యాధికారి హామీ ఇచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతుండగా.. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుగులోత్ రమేష్ నీటి ఎద్దడిపై నిలదీశారు. బోనకల్‌లో ఇందిరాడైరీని ఏర్పాటు చేస్తున్నట్లు మండలం నుంచి 4 వేల మందికి రుణాలకు అవకాశం ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పాలక వర్గానికి ఇదే చివరి సర్వసభ్య సమావేశం అయినప్పటికీ పలువురు ఎంపీటీసీలు డుమ్మాకొట్టడం విశేషం. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజు, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

ఎంవీఐ కార్యాలయ సిబ్బంది పెన్‌డౌన్



సత్తుపల్లి: నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఎంవీఐ యోగేశ్వర్‌సింగ్, సిబ్బంది



వైరా: నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఎంవీఐ వరప్రసాద్, సిబ్బంది

సత్తుపల్లి/వైరా: సత్తుపల్లి రవాణాశాఖ కార్యాలయంలో ఎంవీఐ యోగేశ్వర్‌సింగ్‌తో పాటు ఉద్యోగులు, వైరాలోని రవాణాశాఖ కార్యాలయంలో ఎంవీఐ వరప్రసాద్‌తో పాటు కార్యాలయ సిబ్బంది పెన్‌డౌన్ చేపట్టి విధులు బహిష్కరించారు. హైదరాబాద్‌లో జేటీసీ రమేష్‌పై దాడి నేపథ్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రవాణా శాఖాధికారిపై ఆటో యూనియన్ నాయకుల దాడి బాధాకరమన్నారు. నిరంతరం సేవలందిస్తున్న అధికారులపై దాడులు చేస్తే తగిన బుద్ధి చెబుతామన్నారు. ఎంవీఐ కార్యాలయ సిబ్బంది పెన్‌డౌన్ ప్రకటించడంతో లైసెన్స్‌ల కోసం కార్యాలయానికి దూరప్రాంతాల నుంచి వచ్చిన లబ్ధిదారులు నిరాశతో వెనుదిరిగి వెళ్లిపోయారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి



విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఏఎంఓ రవికుమార్

కొణిజర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని అకడమిక్ మానిటరింగ్ అధికారి కె.రవికుమార్ అన్నారు, శుక్రవారం మండలంలోని లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో తెలుగు, ఆంగ్లం చదివించి వారి పఠన శక్తిని పరిశీలించారు. గణితంలో చతుర్విద ప్రక్రియల గురించి అడిగి సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం అనేక పథకాలు పెడుతుందని వాటిని సద్వినియోగం చేసుకుని మరింత మంది బాల బాలికలను ప్రభుత్వ పాఠశాలలకు రప్పించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం షేక్ కరామత్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

బొగ్గు గనుల వేలం ఆపాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

సత్తుపల్లిరూరల్: బొగ్గు గనుల ప్రైవేటీకరణపైన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనుల వేలం ఆపాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి డిమాండ్ చేశారు. శుక్రవారం సత్తుపల్లి అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ప్లేకార్డులతో నిరసన కార్యక్రమం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణలో సింగరేణి ఆధ్వర్యంలో ఉన్న బొగ్గు గనుల వేలం వేయకుండా సింగరేణి సంస్థకు అప్పగించాలని డిమాండ్ చేశారు. సింగరేణి బొగ్గు టన్నుకు రూ.3,500 నుంచి రూ.4,500కు విక్రయించాలని వివరించారు. ఆదాని, అంబానీ అయితే టన్ను బొగ్గును రూ.18వేలకు విక్రయిస్తారని చెప్పారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు మోరంపూడి పాండు రంగారావు, జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. బొగ్గు గనుల ప్రైవేటీకరణను నిలిపివేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు సర్వేశ్వరరావు, రాము, బడేమియా పాల్గొన్నారు.


ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి

చింతకాని: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కన్నెబోయిన లక్ష్మయ్య ఫౌండేషన్ చైర్మన్ సీతారామయ్య తెలిపారు. మండలంలోని రామకృష్ణాపురం ఉన్నత పాఠశాలకు శుక్రవారం కన్నెబోయిన లక్ష్మయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.12 వేలు విలువ చేసే వంట పాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య ఫౌండేషన్ సభ్యులను గ్రామపెద్దలు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మాధవిదేవి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



రామకృష్ణాపురం ఉన్నత పాఠశాలకు వంట పాత్రలు అందిస్తున్న సీతారామయ్య

ఘనంగా మాజీ ప్రధానమంత్రి పీవీ జయంతి



సత్తుపల్లిటౌన్: పి.వి.నర్సింహారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సత్తుపల్లిటౌన్/వేంసూరు/ఎర్రుపాలెం: మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు జయంతి వేడుకలు సత్తుపల్లి పట్టణం, వేసూరు, ఎర్రుపాలెం మండలాల్లోని కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యాన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంద్భంగా పీవీ నరసింహారావు విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమాలల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమిరెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు కాసరి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ రాఘవరెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఎండీ ఫైజుద్దీన్, పావని శ్రీనివాసరెడ్డి, మేడా వెంకటేశ్వరరావు, తుమ్మూరు రామిరెడ్డి, గువ్వల బాబిరెడ్డి, బుడే, నరసింహారావు, శివ, ఫిరోజ్, చెన్నకేశవరెడ్డి, అప్పారావు, చెన్నారావు, సుబ్బారెడ్డి, సామేలు, సుజలరాణి, కమల్‌పాషా, మౌలాలీ, వినోదరావు, శర్మ, అప్పారావు, నరసింహారావు, కడియం శ్రీనివాసరావు, వెంకట్రామిరెడ్డి, వెంకటకృష్ణారావు, ఇస్మాయిల్, వెంకటనర్సయ్య, బాబురావు, రామారావు, వెంకటనారాయణ, జనార్ధన్, బాజీ, అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.